# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 97 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

11-02-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


# ఒక్క ప్రారంభోత్సవానికి మూడు చోట్ల శిలాఫలకాలు




నవతరం టెక్కలి

స్థానికటెక్కలి మండలంలోని తిర్లంగి గ్రామ పంచాయతీ వీర రామకృష్ణ పురం గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శిలాఫలకం నిర్మాణం పనులు పలు విమర్శలు ను గుప్పిస్తున్నాయి. ఆలయానికి దర్శనం కొరకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఈ శిలాఫలకం కనిపించాలని ఉద్దేశము.. అన్నట్లుగా ఆ నిర్మాణం పనులు కనిపిస్తున్నాయి. గ్రామంలో మరి ఎక్కడ ప్రభుత్వ భూమి లేదా... ఆలయ ప్రాంగణంలోనే రెవెన్యూ అధికారులకు కనిపిస్తుందా అని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించిన శిలాఫలకం నిర్మాణంతో భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కనిపిస్తుంది. అని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ శిలాఫలక నిర్మాణ పనులను ఆపి ప్రభుత్వ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టాలని ఒక్క ప్రారంభోత్సవానికి ఒక్క శిలాఫలకం చాలదా అని స్థానిక ఆలయ భక్తులు మరియు గ్రామ ప్రజలు భావిస్తున్నారు.

- ఆలయ స్థలంలో ప్రభుత్వ శిలాఫలకం నిర్మాణం
- ఒక్కొక్క శిలాఫలకానికి 20వేల రూపాయలు ఖర్చు
- గ్రామ ప్రజలకు ఇబ్బందికరముగా నీటి కుళాయికు అతి దగ్గరగా నిర్మించిన శిలాఫలకం
- శిలాఫలకానికే స్థల సేకరణ ఇంకా పక్కా నిర్మాణ కట్టడాలకు స్థల నిర్ధారణ చేయని అధికార యంత్రాంగం.
- గ్రామంలో ప్రభుత్వ భూమి లేదా..
- భక్తులు మనోభావాలను దెబ్బతీయటమే లక్ష్యమా...
- ఆలయ స్థలంలో శిలాఫలకం నిర్మాణంపై పలు విమర్శలు

# శ్రీముఖలింగం వేడుకలకు వైద్యుల విరాళం

నవతరం - శ్రీకాకుళం



శ్రీముఖలింగం మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నరసన్నపేట ప్రైవేట్ వైద్యులు తమ వంతు సహాయంగా రూ. 1,60,000 విరాళాన్ని సేకరించి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మంగళవారం అందజేశారు. ఈ విరాళం అందించిన వారిలో డా. బలగ మురళి రూ. 20వేలు, బగ్గు సరోజినీ దేవి ఆసుపత్రి, గొలివి ఆసుపత్రి, డా. పొన్నాడ గణేష్, డా. తాడేల శ్రీకాంత్, డా. బలగ రమణారావు-అమృత, డా. బోర సాయిరామ్, డా. రాజేంద్ర-కిరణ్ మాధురి, డా. అనిల్-కృషి, డా. పొన్నాన గురునాథం, డా. రెడ్డి సంధ్య తలా రూ. 10వేలు చొప్పున ఉన్నారు. భక్తుల సౌకర్యార్థం వైద్యులు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే డా. పాగోటి శంకర్, డా. సూరాపు కృష్ణారావు-సుధారాణి, డా. మెండ ప్రవీణ్-పద్మావతి, డా. తర్రా సురేష్, డా. బల్కా నవీన్, డా. రెడ్డి భార్గవ్, డా. బలగ రమేష్ లు తలో రూ. 5వేలు, డా. గురుదేవ్ రూ. 3వేలు, డా. ప్రకాష్ రూ. 2వేలు తమ వంతు సహాయం అందించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డి.సి.హెచ్.ఎస్ డా. కల్యాణ్ బాబుతో పాటు వైద్యులు గణేశ్వరరావు, మురళి బలగ, భార్గవ్, శంకర్ రావు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై ఛలో విజయవాడ

APWJF

- అన్ని జిల్లాల్లో ఏపీడబ్ల్యుజేఎఫ్ నేతల పర్యటన
- 11న శ్రీకాకుళంలో సన్నాహాక సమావేశం

నవతరం - శ్రీకాకుళం

అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) ఆధ్వర్యంలో ఛలో విజయవాడ కార్యక్రమం త్వరలో నిర్వహించనున్నట్లు ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, ఎనఏజే జాతీయ కార్యవర్గ సభ్యులు సత్తారు భాస్కరరావు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కృష్ణ, జి.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు సువ్వారి మురళీధర్, డి.ఆనందరావు, టి.భీమారావు, జి.నరసింగరావు, బి.వాసుదేవరావు, వై.తవిటయ్య తదితరులు ప్రకటన విడుదల చేశారు. ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఏపీడబ్ల్యుజేఎఫ్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఎనఏజే జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, రాష్ట్ర నాయకులు పి.నారాయణతో పాటు పలువురు నేతలు ఈ నెల 11న జిల్లాకు రానున్నట్టు వారు తెలిపారు. 11న ఉదయం 10.30 గంటలకు శ్రీకాకుళం ఎన్‌జీవో హోంలో ఏపీడబ్ల్యుజేఎఫ్ జిల్లా కార్యవర్గ ప్రతినిధులు, జర్నలిస్టులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఏపీడబ్ల్యుజేఎఫ్ ఆఫీస్‌బేరర్లు, సభ్యులు, జర్నలిస్టులు హాజరుకావాలని కొంక్యాన వేణుగోపాల్, సత్తారు భాస్కరరావు, ఎస్.కృష్ణ, జి.లక్ష్మణరావు హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు, మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టులకు పింఛను, దాడులు నియంత్రణకు కమిటీ ఏర్పాటు, మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, జర్నలిస్టులకు అవార్డులు, కార్మిక భీమా, ఆరోగ్యభీమా ఏర్పాటుపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.




# ఐతమ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఘనవిజయం

- ఆక్వావ్-2025 పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బంగారు బహుమతి, రూ.50 వేల నగదు పురస్కారం!
- పోటీలో పాల్గొన్న వేలాది బృందాలకు వెనక్కి నెట్టి ప్రథమ స్థానంలో నిలచిన ఐతం విద్యార్థులు
- ఏపీ సీఎం కేంద్ర రాష్ట్ర మంత్రులు ఐఐటి డైరెక్టర్ చేతులు మీదుగా అందుకున్న బంగారు బహుమతి నగదు పురస్కారాలు.
- ఈ విజేతలకు రెండు ప్రముఖ కంపెనీలు అందించిన ఇంటర్న్‌షిప్ అవకాశాలు
- విజయం సాధించిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ ప్రో వివి నాగేశ్వరరావు ప్రశంసల వెల్లువలు

2లో




# అమరావతి రాజధాని నిర్మాత చంద్రబాబు

- శర వేగంగా జరుగుతున్న అమరావతి రాజధాని నిర్మాణ పనులు
- ఏ పి విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పి ఎం జె బాబు



2లో

ఎడిటోరియల్

# మోకరిల్లిన మోడీ!

ఎప్‌స్టీన్ ఫైల్స్, అమెరికా ట్రేడ్ డీల్‌పై ఉభయసభలూ అట్టుడుకుతున్నాయి. "భారత్‌పై విధించిన సుంకాలను పద్దెనిమిది శాతానికి అమెరికా తగ్గించిందని, అందుకు ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు 'జీరో' స్థాయికి చేరతాయని" ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు, రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకూడదన్న షరతుకు సైతం తలొగ్గి...ట్రంప్ ప్రకటనకు మోడీ ధన్యవాదాలు తెలపడం భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బతీసే విధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేస్తోంది. మనం ఏయే దేశాలతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉండాలో కూడా అమెరికానే నిర్దేశిస్తోంది. ఇలాంటి తలబిరుసు పెత్తనానికి భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలవంచకూడదు. కానీ, మన ప్రధాని పూర్తిగా దాసోహపడటం మనదేశ ప్రతిష్టకు, ప్రయోజనాలకు తీవ్రమైన దెబ్బ. అమెరికా సరుకుల డంపింగ్ యార్డ్‌గా భారత్‌ను మారుస్తున్నారు మోడీ.
అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక... తన దారిలోకి రాని దేశాలపై ఎడా పెడా పన్నులు బాదడం తన వ్యూహంగా ఎంచుకున్నాడు. కెనడా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలపైనా, రష్యా, చైనా వంటి పోటీ దేశాలపైనా విరుచుకుపడ్డాడు. సుంకాల విధింపుతో ఆయా దేశాల వాణిజ్యానికి తాత్కాలికంగా నష్టం కలగొచ్చు గానీ, ధరలు పెరిగి అమెరికా పౌరులకు కూడా అంతే సమస్య ఎదురవుతుంది. దీంతో, ట్రంప్ దూకుడుకు వ్యతిరేకంగా అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి.
సుంకాలు ఎదుర్కొన్న అనేక దేశాలు సైతం అదే పద్ధతిలో 'నీకు మేమంత దూరమో..మాకు నువ్వూ అంతే దూరం' అని తిరుగు టపా పంపాయి. ఈ సుంకాలలో మార్పు రైతులకు మేలు చేస్తుందని మోడీ ప్రభుత్వం మరో పచ్చి అబద్ధం చెప్తోంది. నిజానికి ఇది మన రైతాంగానికి, పరిశ్రమలకు, వ్యాపారులకు కూడా విపరీతమైన నష్టం కలిగిస్తుంది. మరీ విచిత్రం ఏమిటంటే ఈ విషయమై అమెరికా నుంచి ప్రకటన వెలువడిందే తప్ప మనదేశం నుంచి కాదు. పైగా మోడీ అభ్యర్ధన మేరకే ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని ట్రంప్ అంటున్నారు.
అమెరికాతో మోడీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఈ ఒప్పందం రైతులకు శరాఘాతం. దీని దుష్ప్రభావం రైతులకే పరిమితం కాదు. దేశ ప్రజలందరూ అధిక ధరలు భరించవలసి వస్తుంది. మోడీ మొహం చూడడానికే ఇష్టపడని ట్రంప్ ఈ ఒప్పందం కుదిరినట్టు చెప్పినప్పుడు ప్రియమైన మోడీ అని సంబోధించారు. మోడీ మురిసిపోయారు. ఇది మోడీ నిస్సిగ్గుగా ట్రంప్‌కు దాసోహం అనడమే. మోడీ ఎన్ని ప్రగల్భాలు పలికినా వ్యవసాయంపై ఆధారపడిన దాదాపు 70-80 కోట్ల మంది జనం వెన్నులో బాకు దించడమే. అంతేకాదు అమెరికాలోని కీలక రంగాల్లో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడికి మోడీ హామీ ఇవ్వడం మన ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే. సమావేశాలు జరుగుతున్నప్పుడు ఈ ఒప్పందం గురించి పార్లమెంటుకు మాట మాత్రంగానైనా చెప్పకపోవడం చూస్తే మోడీకి పార్లమెంటు అంటే ఎంత తృణీకారభావన ఉందో తేలిపోతోంది.
ఒకవేళ అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వ్యవసాయోత్పత్తులు చౌకగా వస్తాయనుకున్నా దీని అంతరార్థం ఏమిటంటే భారత రైతుల నుంచి ప్రభుత్వం కొనడం తగ్గిపోతుంది. ఇది మనరైతుల నడ్డి విరవడమే. మూడు వివాదాస్పద వ్యవసాయ బిల్లులను ఉపసంహరించి మహోపకారం చేశామంటున్న మోడీ... అమెరికా దోపిడీకి సకల అవకాశాలు కల్పిస్తూ తలుపు తెరిచారు. దీనివల్ల అమెరికా రైతులకు అపారమైన లాభం ఉంటుందని అమెరికా వ్యవసాయ మంత్రి బ్రుక్ రోలిన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారంటే ప్రయోజనం ఎవరికో చెప్పక్కర్లేదు. రైతులు, పశుపాలకులు, మత్స్య కార్మికుల ప్రయోజనాల విషయంలో ఎన్నడూ రాజీ పడబోమని మోడీ ఆ ప్రసంగంలో గొంతు చించుకుని మరీ చెప్పారు. మరి ఇప్పుడు మోడీ ప్రకటన చూస్తే రాజీ పడడమే కాదు... దాసోహం అన్నారని స్పష్టంగా అర్థం అవుతోంది. ఈ ఒప్పందం వల్ల రైతులే మూల్యం చెల్లించవలసి వస్తుందనడం వాస్తవం.
ఈ ఒప్పందంతో మన రైతులకు ఒరిగేది మాత్రం శూన్యం. అమెరికా మార్కెట్‌ల కోసం మన రైతుల కడుపు కొడుతున్నారు. స్వావలంబన గురించి గొంతు చించుకోవడం తప్ప మోడీ చేసేదేమీ ఉండదు. మనకు చిరకాల మిత్రదేశమైన రష్యాతో చమురు దిగుమతి నిలిపివేయడానికి ఒప్పుకోవడం అంటే నికార్సైన మిత్రద్రోహమే. ఒక సార్వభౌమ దేశ ప్రధాని ఇంత లొంగుబాటు వైఖరిని ఎందుకు ప్రదర్శించినట్టు? లోపాయికారీ ఒప్పందాలతో దేశం పరువును ఎందుకు దిగజారుస్తున్నట్టు? ఇప్పుడు కూడా వాణిజ్య ఒప్పందంపై ఎలాంటి స్పష్టతా ఇవ్వకుండా ట్రంప్‌కు కృతజ్ఞతలు చెప్పటానికే పరిమితం కావటం విచారకరం. ఇది గణతంత్ర దేశానికి తీవ్రమైన తలవంపు.

# అలసిపోయిన అమ్మానాన్నలు...!



సమాజహితం కోరే కవి...
అలసిపోయాడు...
కులమతాలకతీతమైన
నవసమాజ నిర్మాణం కోసం
కమ్మని కావ్యాలెన్నో "రాసి రాసి"
...

చుట్టూ ఉన్న లోకం మాత్రం...
కుంభకర్ణుడిలా గాఢ నిద్రలోనే
ఉంది.
ఔను నేడు కవికలం...
జేగంటలు మ్రోగిస్తోంది
సమాజాన్ని మేల్కొల్పేందుకు...

వంటగదిలో అమ్మ...
కొవ్వొత్తిలా కరిగి కరిగి
వెట్టిచాకిరి "చేసి చేసి" అలసిపోయింది.

అమ్మ కమ్మనికలలు కంటోంది తన
పిల్లలు ఉన్నతశిఖరాలను చేరుకోవాలని
ఔను అమ్మత్యాగం అద్దంలా
ముక్కలౌతోంది విముక్తిలేని వెట్టిచాకిరిలో..

కుటుంబ భారంమోసే నాన్న...
గానుగెద్దులా
బాధ్యతల సుడిగుండంలో
తిరుగుతూ అలసిపోయాడు...

అప్పుల ఊబి...
సాలీడు వలలా చుట్టుకోగా
మానసికంగా కుమిలిపోతూ
నిశ్శబ్దంగా రోదిస్తున్నాడు.
ఔను నాన్న బతుకు
నిప్పుల నావలా
మారింది - అప్పుల భారంతో...

విద్యార్థులు, వలలో చిక్కిన చేపల్లా
స్మార్ట్‌ఫోన్ మాయలో పడి
ప్రాణవాయువంటిచదువును
వదిలేసి అలసిపోయారు.

వారి బంగారు భవిష్యత్తు...
పగిలిన అద్దంలా ముక్కలై ఆ డిజిటల్
భూతానికే అంకితమైపోతోంది.
ఔను ఆ యువత ఆశలు నీటిబుడగల్లా
తేలిపోతున్నాయి -సెల్ ఫోన్ మాయలో...

ప్రేయసి, వాడిపోయిన మల్లెపువ్వులా
ప్రియుడి రాకకోసం కన్నులు కాయలు
కాచేలా "చూసి చూసి" అలసిపోయింది.

ఆమె నిత్యనిరీక్షణ...
ఎండిన చెరువులా వెలవెలబోతూ
మూడుముళ్ళ బంధంకోసం తపిస్తోంది.
ఔను ఆమె ప్రేమగాథ...
విధిచేతిలో చిక్కి విలవిలలాడుతోంది...

ముదిరిన బెండకాయ
కూరకు కొరగాదంటూ
ముళ్ళకంచెలా గుచ్చుకునే
కాకులైన లోకుల మాటలకూ
అమ్మా నాన్నలు అలసిపోయారు.

బిడ్డల పెళ్లి నిరీక్షణ...
తీరం చేరని నావలా
ఆ దైవం పైనే భారం మోపి
నిద్రాహారాలు మాని ఎదురుచూస్తున్నారు
ఔను ఆ తల్లిదండ్రుల ఆశ దీపశిఖలా
వెలుగుతోంది - పెళ్లి సంబంధాల
వేటలో...



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# అమరావతి రాజధాని నిర్మాత చంద్రబాబు

**నవతరం -శ్రీకాకుళం**

మన రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులు చూసే భాగ్యం కలిగింది. నూతన అసెంబ్లీ భవనాలు, హైకోర్టు భవనాలు, హైకోర్టు న్యాయమూర్తుల నివాస భవన సముదాయాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రుల భవన సముదాయాలు, నిర్మాణ పనులు శరవేఘంగా సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. అమరావతి దేశంలోనే ఒక అత్యుత్తమ రాజధాని కాబోవడం రాష్ట్ర ప్రజల అదృష్టం.
రాజధాని విషయంలో వైకాపా సృష్టించిన అలజడి నుండి రాష్ట్ర ప్రజల ఈ ఘనత అంతా కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు కే చెందుతుంది. గత వైకాపా ప్రభుత్వ నాయకులు అమరావతి ప్రాంతం నిర్మాణాలకు అనువైనది కాదు అన్న వారికి ఇప్పుడు కళ్ళు భైర్లు కమ్ముతున్నాయి.
మొన్న శంకుస్థాపన జరిగిన క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ మరో చరత్రకు నాంది పలుకుతుంది. విద్యార్థుల పాలిట ఓ బంగారు వరం.
ప్రపంచ శ్రేణి క్వాంటం టెక్నాలజీగా మన రాజధాని అమరావతి.
నిజంగానే రాష్ట్రం 2047 స్వర్ణాంధ్ర దిశగా ముందుకు సాగుతుంది.



# ఐతమ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఘనవిజయం

**నవతరం-టెక్కలి**

ఐతం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆక్వావ్--2025 క్వాంటం సాంకేతిక పోటీల్లో అసాధారణ ప్రతిభను ప్రదర్శించి కళాశాలకు ఘన విజయం సాధించారు. సమస్య వివరణ విభాగంలో పోటీ పడి దేశవ్యాప్తంగా పాల్గొన్న వేలాది బృందాలను వెనక్కి నెట్టి ఐతం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐతం విద్యార్థులు క్వాంటం సాంకేతికం వంటి ఆధునిక రంగంలో తమ మేధస్సు, సాంకేతిక నైపుణ్యాన్ని నిరూపించుకుని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి డా. జితేంద్ర సింగ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ చేతుల మీదుగా బంగారు బహుమతితో పాటు రూ.50,000 నగదు పురస్కారాన్ని అందుకున్నారని వారు తెలిపారు . దేశవ్యాప్తంగా వివిధ దశల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఇరవై వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, ఐతం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో విజేతలుగా నిలవడం మన కళాశాలకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. క్వాంటం సాంకేతిక రంగంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, అధ్యాపకులకు శిక్షణ తరగతులు, నూతన ప్రత్యేక పాఠ్యాంశాలను ఐతం కళాశాలలో నిరంతరంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల "క్యూపీఐ--ఏఐ" సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు అదనపు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ విజేతలకు రెండు ప్రముఖ కంపినిలు ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందించాయని, అవి భవిష్యత్తు లో ఉద్యోగా వకాశాలు గా మారానున్నాయని వెల్లడించారు.
ఈ విజయంపై కళాశాల చైర్మన్ డా. కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్. నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ఐతం విద్యార్థులు సాధించిన ఈ ఘనత కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచిందని అభినందనలు తెలిపారు.
కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్వాంటం సాంకేతికం వంటి భవిష్యత్ ఆధారిత రంగాలలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలే ఇలాంటి విశేష విజయాలకు కారణమవుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజేతల బృందంలో యు. రాజేశ్వరరావు, డి. దీపక్, కె. గుణసాగర్, ఎ. గాయత్రి, ఎస్. ప్రవీణ, బి. నీలిమ మరియు సంబంధిత విభాగానికి చెందిన విద్యార్థులు ఉన్నారు. ఈ బృందానికి సమన్వయకర్త డా. బి. కిరణ్ కుమార్, మార్గదర్శకురాలు డా. కె. స్వరూపరాణి మార్గనిర్దేశం చేయగా, విభాగాధిపతి డా. టి. నరేష్ ప్రోత్సాహం అందించారు.

# విద్యార్థి దశలో కళ్ళను సంరక్షించుకోవాలి..

- మండల విద్యాశాఖ అధికారి జే చిన్నవాడు
- మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కళ్ళద్దాల పంపిణీ..



**నవతరం -శ్రీకాకుళం**

జాతీయ అంధత్వ మరియు దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అందత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం ఆధ్వర్యంలో సంతబొమ్మాలి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 15 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి జే చిన్నవాడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏడాదికోసారి కంటి పరీక్షలు చేసుకొని కళ్ళను సంరక్షించుకోవాలి అన్నారు. కార్యక్రమంలో పి హెచ్ సీ వైద్యాధికారి డా. ఎన్ నందిని మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న వారంతా తప్పనిసరిగా కంటి అద్దాలను ధరిస్తూ సమతుల ఆహారం భుజిస్తూ, సరైన వెలుతురులో చదువుకుంటూ, మొబైల్స్ కు దూరంగా ఉండటం వల్ల వారు కంటి చూపును కాపాడుకోవచ్చు అన్నారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం ఆర్ కే దాస్ మాట్లాడుతూ మండలంలో 70 పాఠశాలలో 4700 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న 389 మందికి కళ్లద్దాలు పంపిణీ చేయుటకు సిద్ధం చేశామన్నారు .ఈ నెలాఖరు లోపల అందరికీ కళ్లద్దాలు పంపిణీ పూర్తి చేస్తామన్నారు.
విద్యార్థులకు "కంటి ఆరోగ్యం- సంరక్షణ"పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం నాగరాజు, ఆరోగ్య విస్తరణాధికారి కె శ్రీనివాసరావు , ఆరోగ్య పర్యవేక్షకులు ఎం భాగ్యవతి ఆరోగ్య కార్యకర్త పి గణేశ్వరరావు, ఆశా కార్యకర్త ఎస్ సరోజినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బనవాసి మధుకేశ్వర ఆలయం కర్ణాటక రాష్ట్రం



మధుకేశ్వర ఆలయం కదంబ సామ్రాజ్యంలో తొమ్మిది సంవత్సరములు నిర్మించిన ఈ పురాతన ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఈ ప్రాచీన ఆలయం ఉత్తర కన్నడ జిల్లాలో ఉన్న కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా సరిహద్దుల్లో బనవాసి గ్రామంలో ఉన్నది. పశ్చిమ కనుమల ప్రశాంతమైన పరిసరాలు, పచ్చదనం మధ్య ఉన్న మధుకేశ్వర ఆలయం గొప్ప చారిత్రక గతానికి కేంద్ర బిందువు. ఈ ఆలయాన్ని తొమ్మిదవ శతాబ్దంలో కర్ణాటక ప్రారంభ పాలకులలో ఒకరైన కదంబ పాలకులు నిర్మించారు. అద్భుతమైన కళా నైపుణ్యానికి నిర్మాణానికి అద్దం పడుతున్న ఈ ఆలయం ఏటా వేలసంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఈ ఆలయ నిర్మాణం వైభవం సహజ సౌందర్యానికి ప్రసిద్ధి చెందింది.

## ఆలయ విశేషాలు

మధుకేశ్వర ఆలయం లోపల, ఆవరణలో... విష్ణుమూర్తి, అలగే... విష్ణు రూపాన్ని అలంకరించబడిన అనేక విగ్రహాలు సందర్శించవచ్చు. ఏకశిలతో చేయబడిన త్రిలోక మంటపంలో భూమి, స్వర్గం, పాతాళ లోకాలు ప్రదర్శించబడుతుంటాయి. ఈ యాత్రాస్థలంలో మరో ప్రధాన ఆకర్షణ గణేశుని విగ్రహం. ఈ విగ్రహం సగం వరకే ఉంటుంది. ఈ విగ్రహం యొక్క మిగిలిన సగం వారణాసిలో ఉన్నదని యాత్రికులు నమ్ముతారు. ఈ గణేషుని విగ్రహమే కాకుండా, నరసింహ స్వామి విగ్రహం కూడా ఈ మధుకేశ్వర ఆలయంలో చూడవచ్చు. ఈ ఆలయాన్ని సందర్శించినప్పుడు భక్తులు ఐదు పడగల నాగేంద్రుని శిల్పం కూడా మనం చూడవచ్చు. ఈ శిల్పం 2వ శతాబ్దానికి చెందినది. పరిశీలనగా చూస్తే, ప్రాకృత భాషలో ఈ నాగ శిల్పంపై ఒక శిలాశాసనం గమనించవచ్చు. శిలాశాసనం నుండి సేకరించిన సమాచారం ప్రకారం శిల్పం ఏర్పాటుతోపాటు ఇక్కడ ఉన్న ఒక తొట్టి నిర్మాణం కానీ శివస్కాంత నాగశ్రీ ద్వారా ఇక్కడ ప్రతిష్టింపబడిందని తెలుస్తోంది. దేశం మనదే నుండి శుభ భక్తులు శివరాత్రి సందర్భంలో మధుకేశ్వర ఆలయం దర్శించారు.

## ఆలయ చరిత్ర

క్రీ.శ. 325-540 మధ్య కదంబులు ఈ గ్రామాన్ని రాజధానిగా చేసుకుని పాలించారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ నివసించే ప్రజలు ఎన్నో కళల్లో నిష్ణాతులు. వడ్రంగం, నగిషి, బుట్టల అల్లిక, కుండలు తయారుచేయడం ఇక్కడి వారి వృత్తి. వ్యవసాయంలో కూడా వీరిది అందెవేసిన చెయ్యి. చెరకు, ధాన్యం, అనాస ఇక్కడ పండే పంటలు. చైనా యాత్రికుడు హ్యూయాన్త్సాంగ్ కూడా ఇక్కడ పర్యటించాడని చెబుతారు. తొమ్మిదో శతాబ్దంలో నిర్మించిన మధుకేశ్వరాలయం చుట్టూ ఈ గ్రామం విస్తరించింది.


## ప్రకృతి, శిల్పకళ

మనం ఎటు చూసినా పచ్చని ప్రకృతి పరుచుకున్నట్టు కనిపించే ఈ గ్రామం మధ్యలో మధుకేశ్వరాలయం ఉంది. ఈ ఆలయంలోని శిల్పకళ ఆనాటి సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ఆనాటి శిల్పుల కళా నైపుణ్యం చూసిన వారిని 'ఔరా' అనిపించకమానదు. ఈ గ్రామంలో ఉన్న 'గుధాపుర' సరస్సు ఈ గ్రామం అందాన్ని మరింత పెంచుతుంది. ఈ సరస్సు పైనుంచి వీచే చల్లని గాలులు మనసును ఆహ్లాదపరుస్తాయి. సంవత్సరమంతా ఇక్కడ ఉల్లాసభరితమైన వాతావరణం కనువిందు చేస్తుంది కాకపోతే మార్చి నెలలో ఇక్కడ పర్యటిస్తే మర్చిపోలేని మధురానుభూతి పర్యటకుల సొంతమవుతుంది.

శివుడికి అంకితం చేయబడిన బనవాసి మధుకేశ్వర ఆలయం నిర్మాణ శైలిని గమనించడం మీకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని కలిగిస్తుంది. ఇది రాతితో చెక్కబడిన ఆలయం, దీనిని పురాతన ద్రావిడ నిర్మాణ శైలిలో నిర్మించారు. ఆసక్తికరంగా, కదంబ రాజు సామ్రాజ్యం నుండి ఇప్పటికీ నిలిచి ఉన్న ఏకైక దృశ్య జ్ఞాపకం ఈ ఆలయం. ఈ ఆలయ నిర్మాణం 340 ఏ డి నాటిదని పురావస్తు నిపుణులు కూడా విశ్వసిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణం హొయసల, సోండా, పల్లవ, చాళుక్య మరియు రాష్ట్రకూట నిర్మాణ పాఠశాలల అందమైన మిశ్రమం. శతాబ్దాలుగా, వివిధ పాలకులు ఈ నిర్మాణం యొక్క వైభవానికి తోడ్పడుతూ వచ్చారు.

బనవాసి మధుకేశ్వర ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించగానే, దాని కళానైపుణ్యంలో అద్భుతమైన ఒక ప్రత్యేకమైన ప్రదేశంలోకి ప్రవేశించిన అనుభూతిని కలిగిస్తుంది. ఆలయం లోపలి భాగంలో అలంకరించబడిన స్తంభాలు మరియు చక్కగా వేయబడిన విశాలమైన నేల ఉన్నాయి. ఆలయంలోని ప్రతి అంశం విభిన్న నిర్మాణ శైలులకు నిదర్శనం. మధులింగం దాదాపు 64 అంగుళాల పొడవు ఉంటుంది మరియు తేనె రంగు రాతితో రూపొందించబడింది. రుచిలో తీపిగా ఉండటం వల్ల ప్రేమ మరియు స్నేహానికి చిహ్నంగా పనిచేసే తేనె ఇక్కడ అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉంది. వెండి మానవ ముఖంతో కప్పబడిన శివలింగాన్ని భక్తులు ఉదయం హారతి మరియు ఆచారాల సమయంలో మాత్రమే చూడవచ్చు. ఆలయంలోని మహామండపంలోని గర్భ గృహంలో ఉంచిన శివలింగం రెండు స్తంభాల ఎదురుగా ఉంది. ఒకటి దీపస్తంభం, ఇది వెలిగించిన దీపాలను మోసే పాత్రను కలిగి ఉంటుంది, మరొక స్తంభం పిరమిడ్ లాంటి పునాదితో అసాధారణ నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. బనవాసి మధుకేశ్వర ఆలయంలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి అందువల్ల భక్తులు దృష్టిని ఆకర్షిస్తుంది శివలింగం ముందు ఏడు అడుగుల ఎత్తయిన నంది విగ్రహం ఉంది ఇది శివలింగం ముందు తయారు చేయబడింది. దాని తల వంగి ఉంటుంది మరియు ఒక కన్ను శివలింగం ఉంచబడిన గర్భగృహంలోకి నేరుగా కనిపిస్తుంది. మరొక కన్ను వికర్ణంగా ఉంటుంది మరియు బనవాసి మధుకేశ్వర ఆలయం సమీపంలో ఉంచబడిన ఆదిశక్తి అయిన పార్వతి దేవి ఆలయానికి వెళుతుంది. నంది విగ్రహం విస్తృతంగా చెక్కబడింది మరియు ఒకదానికొకటి భిన్నంగా కనిపించే గ్రానైట్తో చేసిన అలంకరించబడిన స్తంభాలతో చుట్టుముట్టబడి ఉంటుంది. గమనించదగ్గ మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, దేవతలను వారి సహచర దేవతలు మరియు వారి వాహన (పర్వతాలు)తో ఉంచలేదు. శివుని భార్య పార్వతి దేవి ఆలయం ఒక అందమైన దృశ్యం. పవిత్రమైన నవరాత్రి (తొమ్మిది రాత్రులు) పండుగ సమయంలో ఆలయ అందం సజీవంగా కనిపిస్తుంది. బనవాసి మధుకేశ్వర ఆలయంలోని నృత్య మండపం ప్రత్యేకమైనది మరియు పురాతన కాలంలో దేవదాసి వ్యవస్థను ఎలా అనుసరించారో మనకు చూపిస్తుంది. ఈ మండపం నల్ల రాతితో చేసిన స్తంభాలు మరియు బెంచీలతో ఆకర్షణీయమైన నిర్మాణ శైలిని కలిగి ఉంది. మహామండపం దగ్గర శిల మండపం ఉంది, ఇది త్రిలోకానికి ప్రాతినిధ్యం వహిస్తుంది, ఇది హిందూ పురాణాల ప్రకారం బ్రహ్మ, విష్ణు మరియు శివుడు పాలించే మూడు లోకాలను సూచిస్తుంది. దర్శన మండపంలో విష్ణువు యొక్క పొడవైన విగ్రహం ఉంది. విష్ణు యొక్క మధుసూదన అవతారం ఇక్కడే ఉందని మరియు ఆ నమ్మకం కారణంగా ఆలయ పునాది వేయబడిందని భక్తుల విశ్వాసం.


వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్, ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్ కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488

## ఉత్సవాలు(కారు ఫెస్టివల్)

ప్రపంచ ప్రసిద్ధి చెందిన పూరి జగన్నాథ్ అని ప్రదయాత్ర తర్వాత ఎక్కడ జరిగే "కారు ఫెస్టివల్ "మళ్లీ అంతటి పేరు సంపాదించుకుంది. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యంలో ప్రజలు పాల్గొంటారు. చక్కని భారతీయ సంప్రదాయం ఈ ఉత్సవంలో కనువిందు చేస్తుంది. సంప్రదాయ నృత్యాలు, ఇక్కడి సంస్కృతిని ప్రతిబింబించే పద్యాలు, పాటలు ఈ ఫెస్టివల్కే హైలైట్గా నిలుస్తాయి. అలాగే 'బనవాసి కళామేళ'. ఇందులో అక్కడి ప్రజలు తీర్చిదిద్దిన కళారీతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకృతులను 'బనవాసి హోమ్'లో చూడొచ్చు. శిల్పాలు, నగిషీలు, పెయింటింగ్స్ ఇలా అన్ని రకాల కళాకృతులు ఇక్కడ దర్శనమిస్తాయి. ఈ గ్రామ పర్యటనకు వచ్చినవారు తప్పకుండా చూడాల్సిన మరో ప్రదేశం 'వర్ణలోక' ఆర్ట్ గ్యాలరీ. అలాగే 'లక్షద్వీపోత్సవం ఉత్సవం' కూడా ఇక్కడి వారి సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతుంది.

మధుకేశ్వర ఆలయం ఇలా చేరుకోవాలి :

బనవాసి బెంగళూరు నుండి 370 కిలోమీటర్ల దూరంలో ఉంది హుబ్లీ విమానాశ్రయం ఇక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది హవేరి, బనవాసి పక్క పక్కన ఉండే రైల్వే స్టేషన్ల. ఇవి ఇక్కడికి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి ఈ పట్టణం ఇతర నగరాలతో బాగా అనుసంధానింపబడింది కనుక రాకపోకలు ఒక సమస్య లేదు.

# ప్రచారానికి మాత్రమేనా పూజాహెగ్డే?



ఇదిగో తోక అంటే అదిగో పులి అన్నట్టు తయారైంది పూజా హెగ్డే పరిస్థితి. ఓ పెద్ద సినిమా ప్రకటన రావడం ఆలస్యం, వెంటనే ఆఘమేఘాల మీద పూజాహెగ్డే పేరు తెరపైకొస్తుంది. కొన్ని రోజులు గట్టిగా ప్రచారం జరుగుతుంది. ఆ తర్వాత ఏమౌతుందో ఏమో, అసలు చర్చలో లేకుండా పోతోంది ఆమె పేరు.

ఇప్పుడు కూడా 2 సినిమాల విషయంలో పూజా హెగ్డే పేరు అలానే తెరపైకొస్తోంది. వీటిలో ఒకటి నాని సినిమా కాగా, రెండోది అనీల్ రావిపూడి సినిమా.

త్వరలోనే నాని-సుజీత్ కలిసి సెట్స్ పైకి వెళ్లబోతున్నారు. మూవీకి సంబంధించి ఇంకా ఎలాంటి ప్రకటనలు రాలేదు. సినిమాకు బ్లడీ రోమియో అనే టైటిల్ పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాదిలోనే నాని ఆ సినిమాను స్టార్ట్ చేయాల్సి ఉంది. ఇందులో హీరోయిన్ గా పూజా హెగ్డేను తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక మరో సినిమా అనీల్ రావిపూడి, వెంకటేశ్ మూవీ. సంక్రాంతి టార్గెట్ గా రాబోతున్న ఈ సినిమాలో హీరోయిన్లుగా కీర్తి సురేష్, పూజాహెగ్డే పేర్లను పరిశీలిస్తున్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇది కూడా జస్ట్ ప్రచారం మాత్రమే.

ఇలా ఎప్పటికప్పుడు పూజాహెగ్డే పేరు తెరపైకి రావడం, ఆ తర్వాత మరో హీరోయిన్ ఆ ప్రాజెక్టులోకి రావడం ఆనవాయితీగా మారిపోయింది. మొన్నటికిమొన్న ధనుష్ కొత్త సినిమా విషయంలో కూడా ఇలానే జరిగింది. పూజాహెగ్డేకే ఎందుకిలా జరుగుతోందో!



## కొత్త సినిమా ప్రకటించాడు..

# డౌట్స్ పెంచాడు

ఉరుములేని పిడుగులా నాగార్జున నుంచి ప్రకటన వచ్చేసింది. వచ్చే ఏడాది సంక్రాంతికి సోగ్గాళ్లు వస్తున్నారంటూ ఆయన తేదీ కూడా ప్రకటించేశాడు. తను పెద్ద బ్రేకింగ్ ఇచ్చానని నాగార్జున అనుకొని ఉండొచ్చు, కానీ ప్రేక్షకులకు మాత్రం అతిపెద్ద సందేహాన్ని మిగిల్చాడు. ప్రస్తుతం తమిళ దర్శకుడు కార్తీక్ తో సినిమా చేస్తున్నారు నాగార్దున. ఈ హీరో కెరీర్ లో ప్రతిష్టాత్మక వందో చిత్రం అది. ఆ సినిమా నుంచి ఎలాంటి అప్ డేట్స్ లేవు. సైలెంట్ గా షూటింగ్ కానిచ్చేస్తున్నారు.

అసలు ఈ ఏడాది రిలీజ్ అవుతుందా అవ్వదా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. దసరాకు రెడీ అయిపోతుందంటున్నారు కానీ ఏదీ ఇంకా తేల్చలేదు.

అంతలోనే 'వాసివాడి తస్సాదియ్యా' ప్రాజెక్టు ప్రకటించారు నాగ్. జనవరి 15న రాబోతున్నట్టు కూడా డేట్ వేశారు. బంగార్రాజు ఫ్రాంచైజీలో భాగంగా రాబోతున్న ఈ సినిమాను నాగ్ తన వందో చిత్రంగా ప్రకటించబోతున్నారా అనే అనుమానాలు ఇప్పుడు మొదలయ్యాయి.

నిజంగా ఈ చిత్రాన్నే ఆయన వందో చిత్రంగా రిలీజ్ చేయాలనుకుంటే, ప్రస్తుతం కార్తీక్ దర్శకత్వంలో చేస్తున్న సినిమాను కొన్నాళ్ల పాటు హోల్డ్ లో పెట్టాలి. ఒకవేళ దసరాకు కార్తీక్ చిత్రాన్ని రిలీజ్ చేసి, సంక్రాంతికి 'వాసివాడి తస్సాదియ్యా'ను రెడీ చేస్తారనుకుంటే, అంత సమయం ఉందా అనేది మరో సందేహం.

గతంలో బంగార్రాజు ప్రాజెక్టును కూడా నాగార్జున ఇలానే ఆఖరి నిమిషంలో పట్టాలపైకి తీసుకొచ్చి సంక్రాంతికి విడుదల చేశారు. ఇప్పుడీ ఫ్రాంచైజీని కూడా అదే విధంగా 4-5 నెలల్లో పూర్తిచేసి సంక్రాంతికి విడుదల చేస్తారనే టాక్ నడుస్తోంది. ఏదేమైనా తన 2 సినిమాలపై నాగార్జున ఇంకాస్త స్పష్టత ఇస్తే బాగుంటుంది.

## తండ్రి స్ఫూర్తిని చాటేందుకు
# గాంధీ విగ్రహాల పంపిణీ
### అభినందించిన గాంధీ స్మారక నిధి రాష్ట్ర సభ్యులు ప్రసాదరావు



**నవతరం-రాజాం**

రాజాం గాంధీ స్మారక నిధి కన్వీనర్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తన తండ్రి కొత్తా అనంతరావు స్ఫూర్తిని చాటిచెప్పేందుకు తల్లి చంద్రావతి సూచనలతో జాతిపిత మహాత్మాగాంధీజీ విగ్రహాలను ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొల్పి భావితరాలకు ఆదర్శనీయమైన ఆలోచన అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల కొత్తా అనంతరావు పరమపదించడంతో ఆయన జ్ఞాపకార్థం బాపూజీ విగ్రహాల పంపిణీకి రాజాం గాంధీ స్మారక నిధి శాఖ శ్రీకారం చుట్టింది. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గాంధీ స్మారకనిధి రాష్ట్ర కమిటీ సభ్యులు మేడూరు ప్రసాదరావుతో కలిసి స్థానిక ప్రతినిధులు కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ రాజాం గాంధీ స్మారక నిధి శాఖ గడిచిన ఎన్నేళ్లుగా మహాత్ముని ఆశయాలను చాటిచెప్పేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. తల్లిదండ్రులు వివాహం జరిగి 60 ఏళ్లు పూర్తవుతున్న క్రమంలో కొత్తాసాయి ప్రశాంత్‌కుమార్ 60 మహాత్మాగాంధీ విగ్రహాలను రూపొందించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టించేందుకు ప్రయత్నించడం స్ఫూర్తిదాయకమన్నారు. నేటి సమాజానికి బాపూజీ ఆశయాలు ఎంతో అవసరమని ప్రసాదరావు చెప్పారు. భావితరాల భవిష్యత్తుకు మహాత్ముని బాట దోహదపడుతుందని, అందుకోసం కృషి చేస్తున్న రాజాం గాంధీ స్మారక నిధి బృశీదాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజాం గాంధీ స్మారక నిధి బృందం ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్, డాక్టర్ రఘుబాబు, గట్టి పాపారావు, బి.వి.అచ్యుత్‌కుమార్, దాసరి సురేష్, అమృత సురేష్, బొత్స జానకిరాం, పి.వేణుగోపాల్, అమృత నితీష్, పెంకి గౌరీశ్వరరావు తదితరులున్నారు.

# సమాజాసేవలో అందరం భాగమౌదాం




## - లయన్ డా. సింధూర
## - లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హంగర్ ఫీడింగ్

**నవతరం -శ్రీకాకుళం**

సమాజాసేవలో అందరం భాగమౌదామని, ప్రముఖ వైద్యులు లయన్ డా. సింధూర అన్నారు. మన్యం జిల్లా, వీరఘట్టాం ప్రభుత్వ పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయురాలు బలివాడ.స్వాతి, సాయికృష్ణ కుమారుడు బలివాడ.తనిష్క్ జన్మదినం సందర్భంగా శ్రీకాకుళం నగరంలో పలు ముఖ్య కూడాలిలతోపాటు, స్థానిక గొంటి వీధిలో గల పట్టణ నిరాశ్రయుల భవనములో తలదాచుకుంటున్న సుమారు 40 నిస్సహాయ కుటుంబాలకు ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగముగా లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, మంగళవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ జిల్లా మెంబర్షిప్ చైర్మన్ నటుకుల మోహన్, జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, కార్యదర్శి టెక్కం రామగోపాల్, క్లబ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా.విష్ణుమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్, టిడిపి నాయకులు కోరాడ.హరిగోపాల్ చేతుల మీదుగా అన్నప్రసాదాన్ని అందించటం ఆనందంగా ఉందని, నిస్సహాయులకు అన్నప్రసాదాన్ని అందించడం మంచి ఆలోచనని, జన్మదిన వేడుకలను, ఇతరాత్ర వేడుకలను పేదల మధ్య జరుపుకోవడం గొప్ప విషయమని, నేటి ఆహార దాతలు బలివాడ.స్వాతి, బలివాడ.సాయికృష్ణ, బలివాడ. తనిస్క్, బలివాడ. యోగేష్ లకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని సమాజములో మనమంతా సేవకులుగా మారి, అన్నార్థులకు పట్టెడన్నం అందించడంలో భాగమవుదామని పిలుపునిచ్చారు.

ప్రతి నెల లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో హంగర్ ఫీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అందులో భాగముగానే ఈరోజు కూడా ఈ మహోత్తర కార్యక్రమాన్ని వీరఘట్టం వాసులచే చేయడం నిజంగా అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో నేటి దాత ఉర్లం.నవజీవన రావు, ధనలక్ష్మి కుటుంబ సభ్యులు, మండలవీధి సేవకుడు వినయ్, సెల్టర్ నివాసకులు పాల్గొన్నారు.

# లెవీ ని త్వరగా పూర్తి చేయండి


మాచన రఘునందన్

**నవతరం**

కస్టమ్ మిల్లింగ్ రైస్(లెవీ)ని సాధ్యమైనంత త్వరిత గతిన పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్ మిల్లర్ ల కు స్పష్టం చేశారు. మంగళవారం నాడు ఆయన మునుగోడు లో రైస్ మిల్లుల ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. లెవీ ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇప్పటికే మిల్లర్లకు సూచించడం జరిగిందని చెప్పారు.వడ్ల సేకరణ లో నల్గొండ జిల్లా రాష్ట్రం లో నే అగ్రస్థానం లో ఉందని రఘునందన్ వివరించారు.అలాగే లెవీ త్వరగా పూర్తి చేయడం లో కూడా జిల్లా కు మంచి పేరు వచ్చేలా మిల్లులు కృషి చేయాలని ఆకాక్షించారు.

## తిరుపతిలో జరిగిన బీజేవైఎం సమావేశంలో
## పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యకుడు బూరె నరేంద్ర చక్రవర్తి



**తిరుపతి**

బిజెపి యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి రాష్ట్ర నూతన కమిటీని విడుదల చేసిన అనంతరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో మొట్టమొదటి నూతన రాష్ట్ర పదాధికారులు మరియు జిల్లా అధ్యక్షుల సమావేశం నిర్వహించడం జరిగింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిన్ మాధవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన పదాధికారులకి శు భాకాంక్షలు తెలియజేసి యువత రాజకీయ క్షేత్రంలో పెద్ద ఎత్తున చేరి సేవా, సమర్పణ భావంతో దేశ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బూరె నరేంద్ర చక్రవర్తి పాల్గొని రాబోవు కార్యక్రమ కార్యాచరణ ప్రణాళిక గురించి మాట్లాడుతూ యువతకి స్కేల్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను యువతకి చేరువ చేసే విధంగా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపట్టినట్లయితే నిరుద్యోగ యువత వాటిని సహకారం చేసుకుని అంకురాలు స్థాపించి మరికొంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో నరేంద్ర మోధీ గారు ఏ దృక్పథంతో అయితే ఇటువంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు పెట్టారో వాటి సాధికర్త సాధించటంలో కొంత మన భాగస్వామ్యం ఉంటుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు రమేష్ నాయుడు, దయాకర్ రెడ్డి, పూర్య బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీ, నూతన బీజేవైఎం రాష్ట్ర పదాధికారులు, అన్ని జిల్లాల జిల్లా అధ్యక్షులు మరియు శ్రీకాకుళం బిజెవైఎం జిల్లా అధ్యక్షులు మదన్ కూడా పాల్గొన్నారు.

## ఈనెల 15న బాపూజి కళామందిర్లో
# సిక్కోలు సాహితీ సంబరం..



**నవతరం -శ్రీకాకుళం**

ఈనెల 15న శ్రీకాకుళం బాపూజీ కళామందిర్ లో శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి టీ పార్థసారథి, జాతీయ ఉపాధ్యక్షులు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, జాతీయ మీడియా ప్రతినిధి ఎస్ అమ్ము బమ్మిడి,, ఆదేశాల మేరకు సిక్కోలు సాహితీ సంబరం కార్యక్రమం శ్రీకాకుళం శ్రీ శ్రీ కళావేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా శ్రీ శ్రీ కళావేదిక కన్వీనర్ భోగెల ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షులు డబ్బీరు గోవిందరావు ఆధ్వర్యంలో గాంధీ పార్కులో విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 15న బాపూజీ కళామందిర్ లో జరగనున్న సిక్కోలు సాహితీ సంబరానికి పెద్ద ఎత్తున కవులు వచ్చి తమ అమూల్యమైన కవిత గానాన్నిచదివి వినిపించాలని, అనంతరం ప్రతి ఒక్క కవికి సన్మాన సత్కారాలు ఉంటాయని తెలుపుతూ, ఆరోజు పాల్గొన్న కవులకి కొన్ని మార్గదర్శకాలను తెలియజేశారు.ఈనెల 15న (ఆదివారం) అంతర్జాతీయ సాహితీ,సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ శ్రీ శ్రీ కళా వేదిక శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో శతాధిక కవిసమ్మేళనం శ్రీకాకుళం ,బాపూజీ కళామందిరం లో సిక్కోలు సాహితీ సంబరం అందించే సాహితీ శిరోమణి బిరుదును స్వీకరించి మమ్ములను ఆనందింప చేవలసిందిగా పలువురు సాహితీ పోషకులు తరపున శ్రీ శ్రీ కళావేదిక మిమ్ములను సాదరంగా ఆహ్వానిస్తోందని తెలిపారు. .సామాజిక స్థితిగతులపై 20 వరసలకు మించని కవితను బోర్డర్ గీచిన ఎ 4 తెల్లకాగితంపై డీటీపీ లేదా చక్కగా వ్రాసిన ఒక కాపీని రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించాలి. 2పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తమతో తీసుకు రావాలి ఒకటి ఐ. డి. కార్డుకు ఒకటి సర్టిఫికెట్కు లో అంటించడానికి దూరం వారికి దగ్గరవారికి బేధం లేకుండా రిజిస్ట్రేషన్ ప్రకారం కవులకు కవితా పఠనం, సత్కారం నకు అవకాశం ఉంటుందని తెలిపారు.కవులు నేరుగా కవితాశీర్షిక చదివి కవిత చదవాలి.వేగంగా వెళ్లాలి మాకు ముందు సత్కారం చేయండి అంటూనిర్వాహకులకు వత్తిడి తేవద్దు. పుస్తకావిష్కరణకార్యక్రమాలు ఉండే కవులు వాటిని కవితాపఠనం తరువాత ,సత్కారాలు తరువాత చేయగలరు.చేసిన వీలు కల్పించుకొని ప్రతి కవి అందరి కవితాపఠనం వినాలి అందరి సత్కారం చూడాలి ఇదే మీరు మాకిచ్చే గౌరవం ప్రతి కవికీ అతిదులకు, మధ్యాహ్నం భోజనం ఉంటుంది. కార్యక్రమం పై కవుల అభిప్రాయం మేమి చ్చే ప్రత్యేకపుస్తకంలో నమోదు చేసి మీ మొబైల్ నంబరు చిరునామా వ్రాయగలరు అని తెలిపారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు మణిపాత్రుని నాగేశ్వరరావు,, శ్రీ శ్రీ రాష్ట్రకార్యదర్శి ముట్నూరు ఉపేంద్ర శర్మ, ఉపాధ్యక్షుడు ఇద్ది పాపయ్య, కార్యదర్శులు వాడాడ శ్రీనివాస్, చాడ శ్రీనివాస్, ఐ ఎన్ డి ప్రసాద్ , కిల్లాన శ్రీనివాస్, తాళ్లూరి విజయ లక్ష్మణ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## జీ.ఎస్.ఆర్.చౌదరి కి సూపర్ స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డు

**నవతరం -శ్రీకాకుళం**

దివంగత సూపర్ స్టార్ కృష్ణ అభిమానిగా అందరికి సుపరిచితులైన గుమ్మడి సీతారామయ్యచౌదరి కి ఎఫ్.టీ.పీ.సి ఇండియా ( ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) సూపర్ స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డు ని అందచేసింది. ఎఫ్.టి.పి.సి ఇండియా సంస్థ ఇటీవల సూపర్ స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డుల ఫంక్షన్ ను హైదరాబాద్ లో నిర్వహించగా, అనివార్య కారణాల వల్ల ఆ ఫంక్షన్ కు సీతారామయ్యచౌదరి హాజరు కాలేకపోవటంతో, ఎఫ్.టి.పి.సి ఇండియా సంస్థ ప్రతినిధులు మంగళవారం స్వయంగా గుంటూరు కన్నావారితోటలోని జి.ఎస్.ఆర్.చౌదరి ఇంటికే వచ్చి అవార్డును బహుకరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సినీ నిర్మాత వీస్ విజయ్ వర్మ పాకలపాటి, సంయుక్త కార్యదర్శి ఆలపాటి శ్రీనివాస్, సినీ గేయ రచయిత తైదల బాపు అవార్డు మెమోంటోతో పాటు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాన్ని జి.ఎస్.ఆర్.చౌదరికి అందజేసారు. నిజమైన కృష్ణ అభిమానిని గుర్తించాలనే ఈ అవార్డు కి సీతారామయ్యచౌదరి పేరుని కమిటీ గుర్తించిందని కార్యదర్శి విజయ్ వర్మ తెలిపారు. కృష్ణ జీవిత చరిత్ర ను సంపూర్ణంగా సేకరించిన ఘనత ఆయనదేనన్నారు. రచయత తైదల బాబు మాట్లాడుతూ..కృష్ణ అభిమానిగా సీతారామయ్య చేసిన సేవలను ప్రస్తుతించారు. సినీ అభిమానులకు ఆయన



స్ఫూర్తిదాయకమన్నారు. ఈ అవార్డుతో కృష్ణ అభిమానిగా తన జీవితం ధన్యమైందని , ఈ అవార్డు అందించిన ఎఫ్.టి.పి.సి ఇండియా సంస్థ అధ్యక్షులు చైతన్య జంగా, కార్యదర్శి విజయ్ వర్మ లకు సీతారామయ్యచౌదరి కృతజ్ఞతలు తెలిపారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**